# విలువలు

ఈ కమర్షల్ సివిలైజేషన్లో
నా కరఘడియ సుఖమిచ్చేందుకు
ఆ స్త్రీ విలువ
రూపాయిన్నర.
మా కాంట్రాక్టుకి
నిర్ణయించుకోని కన్సిడరేషన్
ఒక రూపాయీ ఎనిమిదణాలు.

వ్యక్తినిబట్టీ, సమయాన్ని బట్టీ, స్టేటస్‌నిబట్టీ పర్సుపట్టీ విలువ హెచ్చావచ్చు.

లేక తగ్గావచ్చు.
కాని, ఆనాడు ఆమె నావద్ద పుచ్చుకున్నదంతే.
పొరపాటు.
ఆమెకి నే నిచ్చినదంతే.
అంతకన్న అధికం ఇస్తే ఆమె వద్దనకా పోను:
తక్కువిస్తే తగవు చెయ్యకాపోను.
అయితే ఆ వేళకి నే నివ్వగలిగినదంత,
ఆనాడు,
బస్సుస్టాండు దగ్గర కలిసే నామెని,
బాగా చీకటి పడ్డాక.

పకోడీల దుకాణం దగ్గర కిరసనూనె బుడ్డి మందంగా వెలుగుతోంది. రెప రెప లాడుతోంది.

ఆమె కట్టుకున్న తెల్లటి చీరమీద ఎర్రటి మసక వెల్తురు దోబూచు లాడుతోంది.

ఆ వెల్తుర్లో, నీడల్లో ఆమె మాసిన ఎర్ర రవిక అవుపించలేదు నాకు.

కాని, అణగిన వంపులు అణక్కుండా పిలుస్తున్నాయి.

కిళ్లీతో ఎర్రబడ్డ పెదిమలు విలాసంగా వంకీలు తిరిగాయి.

కనుబొమల క్రింద కళ్ళు చిలిపిగా కదిలాడాయి.

నీలి కనుపాపలు మిల మిల మెరిశాయి, కొంటెగా సంజ్ఞలు చేశాయి.

నల్లటి కురుల్లో దాగిన జాజి మల్లెల వాసన ఉల్లిపాయ పకోడీల మాసె వాసనతో మిళితమయి గుమాళించింది.

నా చూపులు ఆమె వళ్ళంతా పాకినాయి.

ఆమెమీద నిల్చాయి.

నిలవకుండా, పొంగి వంగిన గీతలమీద జారాయి.

ఆమెని వదలకుండా తిరిగాయి.

చుట్టూ గొడవ, రొద, ధ్వని,

గుడ్డి వెల్తుర్నీ, మసక చీకట్నీ, ఎర్ర ధూళినీ ఆమె చూపులు చీలుస్తున్నాయి.

నన్ను లాగుతున్నాయి.

చుట్టూ గడబిడ, గందరగోళం.

కార్కు సోడాలకి ప్రాణాలు పోతున్నాయి.

శబ్దం చెయ్యడానికే తిరుగుతున్నాయి జట్కాల చక్రాలు.

సైకిల్సు, రిక్షాలు, కార్లు, బస్సులు, బస్లు, మనుష్యులు.

అన్నీ, అంతా కలిసి,

చప్పుడు, చప్పుడు.

చప్పుళ్లో చప్పుడు చెయ్యకుండా పిల్చింది.

పిలవకుండా రమ్మంది.

మాట్లాడకుండా కదిలింది.

పోయే నామె వెంట,
మనసులో సందడితో,
ఒక్కటే కాంక్షతో,
అమితకామంతో.
కలుసుకున్నా నావిణ్ని మలుపులో.
మాట్లాడే నేదేదో,
మాట లనవసరం అయినా,
ఇద్దరికీ తప్పదనేనని,
ఇద్దరికీ తెలుసు.
నేనే అడగనక్కర్లేదు. చెప్పనక్కర్లేదు.
మలుపులో ఉన్న గ్యాస్‌లైటు వెల్తుర్లో ఆమె,
నల్లగా మెరిసింది;
ఎర్రగా నవ్వింది;
వేడిగా చూసింది.
ఇంతట్లో రిక్షా వచ్చి వాలింది.
అంతలోనే రిక్షాలో ఆమె, రిక్షాలో నేను,
రిక్షాలో మనిషి-పక్క-మనిషి; చేతిలో చెయ్యి,
బలంగా, మోటుగా, గరుగ్గా ఉన్న చెయ్యి,
నా వాంఛని రేకెత్తించింది.
నన్ను కంపితుణ్నిగా చేసింది.
రిక్షా పోతోంది సందుల్లోంచి,
ఆట్టే దూరంలేదు సముద్రతీరానికి,
తెల్లటి ఇసక ఇంకా కొంచెం వెచ్చగా ఉంది.
నడుస్తూ నా భుజం పట్టుకొంది.
నాచేతిని లాక్కొని దాచేసుకొంది.
ఆమెవరో నే నడిగేనా ?

నేనెవరో ఆమెక్కావాలా ?
మౌనంగా నడిచి కూలబడ్డాం,
జాలరివాళ్ళ పడవలవార,
పడవల మధ్య మెత్తటి ఇసక,
పడవలమధ్య ఉప్పునీటి చేపల వాసన.
పడవలమధ్య చల్లటిగాలి.
పడవలమధ్య ఆమె నేనూ,
ఉక్కిరిబిక్కిరిగా ఉంది నాకు.
ఆపలేని తాపం కాళ్ళల్లో కంపం పుట్టిస్తోంది.
కంపిస్తున్న నన్ను బలంగా మోటుగా ముద్దులాడింది.
ఘాటైన వాసన.
చవకరకాల సబ్బు, స్నో, ఫేస్ పౌడర్ కలిసిన వాసన.
తడిసిన, మాసిన ఎర్రరవిక చెమట వాసన.
అన్నీ కలిసిన మనిషివాసన.
పిచ్చెత్తించి కళ్ళకి పొరలు కప్పే ఆడదాని వాసన.
మధురమైన సువాసన.
చేతులు పెనవేసుకున్నాయి ఆమెని.
చేతులు గట్టిగా నొక్కేస్తున్నాయి ఆమెని.
నా గుండెల గుబగుబల కామె వెచ్చటి రొమ్ములు జవాబులిచ్చేయి.
గుండెల తలుపులు తట్టేయి.
నెత్తుటి వరదకి గట్లు తెంచేయి.
నా ఆపుకోలేని ఆరాటాని కామె సన్నగా నవ్వింది.
ఆ నవ్వుకి చీకటి వెన్నెల కాసింది.
రాత్రి చీకటిగా ఉంది.
చల్లగా ఉంది.
ఆ చీకట్లో ఆమె నాక్కనిపించలేదు.
ఆమె సజల జలద నీలవర్ణం నీలిరాత్రిలో కలిసిపోయింది.

కాని, ఆ చీకట్లో ఆమె తప్ప నాకింకేదీ కనిపించలేదు.
పొంగిన వక్షాన్ని దిండుగా చేసుకొని,
ఆమె పెదవుల తీపిని తీసేసుకొని,
ఆమె సత్తువ సెదురొక్కొని,
కలిసేను ఆమెని,
సముద్రుడి సమక్షంలో,
చంద్రుడు లేని ఆకాశాన్ని,
చాందినీ చేసుకొని.
నా రక్తం చల్లబడ్డాక,
లేచి కూర్చున్నాక,
తడుముకొంటూ
తీసేను జేబులోంచి,
తీసినది పర్సు.
తీసేనే గాని,
ఎందుకో
చలిగా
చలిచలిగా
పుట్టుకొచ్చింది వణుకు.
చేసినది పాడుపని కాదు
చేస్తున్నది పాడుపని
వెల లేనిదానికి వెల కడుతున్నాను
అమూల్యమైన దానికి మూల్యం నిర్ణయిస్తున్నాను.
బజార్లో వస్తువులాగ
ఆనందాన్ని, ఆడదాన్ని కొనుక్కుంటున్నాను.
అణా యిస్తే పకోడీల పొట్లం దుకాణంలోంచి చేతిలోకొస్తుంది.
రూపాయిన్నర యిస్తే శేరు బియ్యం చీకట్లోంచి వెలుగులోకి వస్తాయి.

కాని వాటికి రోజునిబట్టి ఖరీదుంది, కొలతుంది, ఇంత కింత చొప్పున లెఖ్ఖుంది. అవన్నీ "వస్తువులు"

వస్తువుల క్రింద జమకట్టి కొనుక్కునే ఈ మనిషి ఖరీదు నిర్ణయించలేదనీ,

కనీసం బేరమాడి ధరలెలా ఉన్నాయో కూడా తెలుసుకోనేలేదనీ,

అయ్యో, ఈ లోకంలో Fixed Prices లేని "వస్తువుల్లో" ఇదొకటనీ

పర్సు తీస్తూంటే
గుర్తుకొచ్చింది.
నా కోరిక తీర్చుకొందికి
ఆమెదాన్ని అద్దెకి తీసుకొందికి
ముందుగా
ధర కనుక్కోలేదు
తనని తానే అమ్ముకోవాల్సిన
ఈ "వస్తువు"
నీచాతి నీచం
అంతటి హీనాతి హీనం
పర్సు తీశాను
ఆమె నన్ను గమనించడం లేదు
ఎర్ర రవిక వెనక
నల్లటి రొమ్ములు దాగుంటున్నాయి.
తెల్లటి చీర కుచ్చెళ్ళు
మడతలు పడుతున్నాయి.
మల్లె పువ్వుల దండకోసం మోటు చేతులు
ఇసకలో వెతుకుతున్నాయి.
వెతుకుతున్నాయి
నా చేతులు

పర్సులో చిల్లరకోసం.
నా గుప్పెట్లో కొచ్చిన మూడక్షరూపాయాలు
ఆమె మొఖంలోకి పోయాయి.
మౌనంగా పుచ్చుకుంది
తరువాత
ఆఖరు సారిగా
నన్ను చేతుల్లో లాక్కొని
ముద్దుపెట్టుకొంది.
నవ్వింది.
తీయని ఆనందంతో,
కాని, దుఃఖంతో,
అవమానంవల్ల కలిగిన సిగ్గుతో,
ఆమెని నేకూడా కావిలించుకొని
తలదాచుకున్నాను.
ఆ రాత్రి
ఆమెని అవమానించినందుకు,
ఆమెనే కాదు, స్త్రీజాతిని అవమానించినందుకు,
స్త్రీజాతినే కాదు, మానవలోకాన్నే అవమానించినందుకు,
నన్నూ, ఆమెనీ
సర్వాన్నీ
అవమానించినందుకు,
మానవజీవితం,
అనంతంగా సాగేందుకుగాను
మానవులకి భగవంతుడు
అయాచితంగా ప్రసాదించిన
అమరసౌఖ్యాన్నే
అవమానించినందుకు
నన్ను

నా జాతిని
తిరుగులేని ఘోరశాపాగ్నికి గురిచేసి
లేక,
కాళ్ళ కింద తొక్కి, మట్టిలో కలిపి,
లేక
మంటల్లో విసిరి భస్మం చేయడానికి
బదులు
ఆమె నన్ను
బలమైన చేతుల్లో మృదువుగా కావిలించుకొని,
పొంగిన పాలిండ్లకి మెత్తగా ఆన్చుకొని,
వెచ్చటి పెదవుల్తో తియ్యగా ముద్దులాడింది!
కాని—
తెలిసో తెలియకో నన్ను ఆ రీతిగా క్షమించడంలో
తన సహజ స్త్రీ లక్షణంతో నన్నాదరించి బుజ్జగించడంలో ఆమె
తన ఔన్నత్యాన్ని చూపించింది.
తన ఔన్నత్యాన్ని తారాపథం దాటించింది.
అధోస్థానంలో ఉంటూ,
ఇంకా కిందకి జారిపోతూన్న నాపై
వెన్నెలవర్షం కురిపించింది.
నాకు చేయూతనిచ్చి లేవదీసింది.
ఆడదాని మనస్సు చూపించింది.
చివరకి
ఆమె వెళ్ళిపోయింది
ఆ చీకట్లో
ఎక్కడికో.
ఈ కమర్షల్ సివిలైజేషన్లో
ధరల్లేని బజారులో
ఒకనాటి రాత్రి
వెలలేని దాని విలువ
రూపాయిన్నర!!